పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటాలి

కాచిగూడ: పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి పెంచాలని మహంకాళి ఆలయ ధర్మకర్త రాజేందర్ పటేల్‌గౌడ్ అన్నారు. సోమవారం నింబోలిఅడ్డలోని మహంకాళి ఆలయ ప్రాంగణంలో ఆర్ఎస్ఎస్ నేతలతో కలిసి ఆయన మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మొక్కలు నాటడంతో పాటు వారి సంరక్షణ కూడా చూసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సుదర్శన్ రాజ్, రామోజీ, సుభాష్, రమేష్, సురేష్ మంజునాథ్, వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ



లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులను అందజేస్తున్న ఎమ్మెల్యే ముఠాగోపాల్

చిక్కడపల్లి: సీఎం రిలీఫ్ ఫండ్‌కు దరఖాస్తు చేసుకున్నా అర్హులందరికీ సీఎంఆర్ఎఫ్‌ను అందజేస్తున్నట్లు ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠాగోపాల్ అన్నారు. గాంధీనగర్‌లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సోమవారం 12 మంది లబ్ధిదారులకు రూ.4,34000 సీఎంఆర్ఎఫ్ చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... సీఎంఆర్ఎఫ్‌కు దరఖాస్తు చేసుకున్న వారికి వెంటనే చెక్కులు మంజూరు చేయాలన్నారు. రాంనగర్, ముషీరాబాద్ వివిధ డివిజన్ల అధ్యక్షులు శ్రీధర్‌రెడ్డి, శంకర్ ముదిరాజ్, నాయకులు సాయికృష్ణ, దామోదర్ రెడ్డి, దీన్‌దయాల్‌రెడ్డి, శివ ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

యువత ఉపాధి వైపు పయనించాలి



సుందరయ్య విజ్ఞాన కేంద్రం: యువత ఉపాధి వైపు పయనిస్తూ మంచి అవకాశాలను అందిపుచ్చుకోవాలని తెలంగాణ ఒలింపిక్ అసోసియేషన్ కార్యదర్శి మల్లారెడ్డి అన్నారు. సోమవారం బాగ్‌లింగంపల్లిలోని ఎలైట్ డ్రైవింగ్‌స్కూల్ ఆధ్వర్యంలో కేశవ స్మృతి సంవర్ధన సమితి సహకారంతో డ్రైవింగ్‌లో ఉచిత శిక్షణ 21వ బ్యాచ్ ప్రారంభమైంది. ఈ కార్యక్రమంలో ఎలైట్ డ్రైవింగ్ డైరెక్టర్ ఉపేందర్, బాగయ్య, ప్రసాద్, సతీష్‌గౌడ్, సునీల్‌కులకర్ణి తదితరులు పాల్గొన్నారు.

వచన కవితల పోటీలకు దరఖాస్తుల ఆహ్వానం

చిక్కడపల్లి: సాహిత్య, సాంస్కృతిక సామాజిక సేవా సంస్థ చిమ్మపూడి ఫౌండేషన్ ఆధ్వర్యంలో 10వ తరగతి, ఆ పైన చదువుకున్న విద్యార్థులకు వచన కవితల పోటీలు నిర్వహిస్తున్నామని ఫౌండేషన్ అధ్యక్షుడు చిమ్మపూడి శ్రీరామమూర్తి ఒక ప్రకటనలో తెలిపారు. ఐదుగురు విజేతలను ఎంపిక చేసి నగదు పారితోషికాన్ని అందజేస్తామని పేర్కొన్నారు. ఆసక్తిగల విద్యార్థులు జూన్ 10వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని కోరారు. పూర్తి వివరాలకు ఫోన్ నం.97041 77270లో సంప్రదించాలన్నారు.

చిరు వ్యాపారుల ఆందోళన

సాక్షి, సిటీబ్యూరో: రోడ్ల పక్కన వ్యాపారాలు చేసుకునే తమను ట్రాఫిక్ పోలీసులు, మునిసిపల్ సిబ్బంది ఇబ్బంది పెడుతున్నారని దాదాపు 200 మంది సోమవారం ప్రజావాణి కార్యక్రమంలో ఫిర్యాదు చేసేందుకు జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయానికి వచ్చారు. వారిని లోనికి అనుమతించకపోవడంతో, పోలీసులు, మునిసిపల్ అధికారుల వేధింపులను నిరసిస్తూ ప్రదర్శన నిర్వహించారు. రోడ్లపక్కనున్న తమ బండ్లను తొలగించి, తమ పొట్ట కొడుతున్నారని వేదన వ్యక్తం చేశారు. వీధి వ్యాపారుల (జీవనోపాధి రక్షణ, వీధి వ్యాపారుల నియంత్రణ) చట్టం, 2014ను వెంటనే అమలు చేయాలని, వీధి వ్యాపారులకు చట్టపరమైన రక్షణ కల్పించాలని వారు డిమాండ్ చేశారు.నిబంధనలు అమలు చేయడంలో విఫలమైన అధికారులపై క్రమశిక్షణా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. నేషనల్ హాకర్ ఫెడరేషన్ (ఎన్‌హెచ్ఎఫ్) పేరిట వారు ప్రజావాణిలో తమ ఇబ్బందులు ఫిర్యాదు చేయడానికి వచ్చారు. ట్రాఫిక్ పోలీసులు తమను నిరంతరం వేధిస్తున్నారని, చలాన్లు జారీ చేస్తున్నారని, బండ్లను తొలగిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ట్రాఫిక్‌కు ఎలాంటి ఇబ్బందులు కలిగించకుండా తాము వ్యాపారాలు చేసుకుంటున్నట్లు పేర్కొన్నారు. వీధి విక్రేతల చట్టాన్ని వెంటనే అమలు చేయాలని వారు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

అభివృద్ధి పనుల ప్రారంభం

హిమాయత్‌నగర్: ఆదర్శ్ బస్తీలో అపరిష్కృతంగా ఉన్న సమస్యను పరిష్కరించేందుకు సోమవారం రూ. 33 లక్షలతో చేపట్టిన రీ మోడలింగ్ ఆఫ్ డ్రైన్ వాటర్ పైప్ లైన్, ప్రెషర్ పంప్ పనులను హిమాయత్‌నగర్ కార్పొరేటర్ మహాలక్ష్మి రామన్‌గౌడ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ... వర్షాకాలం రాగానే వర్షపు నీటితో స్థానికులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఈ సమస్యను గుర్తించి దీనిపై ప్రత్యేక దృష్టి పెట్టినట్లు తెలిపారు. ఈ పనులు పూర్తయితే వచ్చే వర్షాకాలంలో ఆదర్శ్ బస్తీలో నీళ్లు నిలువకుండా ఉంటుందన్నారు.



భౌ.. భౌ

- నియోజకవర్గంలో పెరిగిపోతున్న వీధి కుక్కలు బెడద
- గుంపులు గుంపులుగా మీదికొస్తున్న వైనం
- ఇటీవల పలువురిని కరిచిన వీధి కుక్కలు



మధర్ డైరీ వెనుక భాగంలో మోహరించిన కుక్కలు

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: ముషీరాబాద్ నియోజకవర్గంలోని రాంనగర్, బాగ్‌లింగంపల్లి, అడిక్‌మెంట్ తదితర ప్రాంతాల్లో వీధి కుక్కలు (వీధి సింహాలు) స్వైర్య విహారం చేయడంతో స్థానికులు బెంబేలెత్తిపోతున్నారు. ముఖ్యంగా బాగ్‌లింగంపల్లిలోని మదర్ డెయిరీ పార్కు ఎల్ఐజీ, ఎంఐజీ, పాలమూరి బస్తీ తదితర ప్రాంతాలలో కుక్కల బెడద విపరీతంగా ఉందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వృద్ధులు, చిన్నపిల్లలు వాటి ఉన్న చోటి నుంచి పోవాలంటే వెన్నులో వణుకుపుడుతోంది. వాహనదారులను సైతం కుక్కలు పరిగెత్తిస్తుండటంతో వారు భయాందోళనకు గురవుతున్నారు. వీధి కుక్కలన్ని అక్కడక్కడ ఒకే దగ్గరికి చేరుకొని గుంపులు గుంపులుగా ఉండడంతో ఆయా ప్రాంతాల గుండా పోవాలంటేనే భయపడుతున్నారు.

– మెట్లపైకి వెళ్తున్నాయి...

బాగ్‌లింగంపల్లిలోని సుందరయ్య పార్కు పరిసర ప్రాంతాల్లో గల ఎమ్ఐజీ, ఎల్ఐజీ, హెచ్ఐజీ తదితర ప్రాంతాల్లోని అపార్ట్‌మెంటులోని మెట్లను ఎక్కుతూ అక్కడే పడుకుంటున్నాయి. అయితే అపార్ట్‌మెంట్‌లో నివాసం ఉండే వారు ఆదమరిచి గబగబ పైకి వెళ్తుంటే అవి దాడి చేస్తూ కరుస్తున్నాయి. ఇలాంటి సంఘటనలు జరుగుతున్నప్పటికీ సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదనే ఆరోపణలున్నాయి.

ఎవరికి ఫిర్యాదు చేయాలో తెలియక..

వివిధ కాలనీలు, బస్తీలల్లో విపరీతంగా కుక్కల బెడద ఉన్నప్పటికి ఎవరికి ఫిర్యాదు చేయాలో తెలియక వారి ఫోన్ నంబర్లు లేక స్థానిక ప్రజలు సతమతమవుతున్నారు. వీధి కుక్కల బెడద నుంచి మమ్మల్ని కాపాడే నాథుడే లేడా అని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

రేబిస్ సోకితే అంతే సంగతులు..

కుక్కలు కరిస్తే అవి ఎంతో ప్రమాదకరం. పిచ్చి



కుక్కలు కరిచిన, సరైన ట్రీట్‌మెంట్ తీసుకోకున్న అత్యంత ప్రమాదకరమే. రేబిస్ వ్యాధి సోకిదంటే మృత్యువాత పడాల్సిందే. దీనిని ప్రభుత్వాలు పట్టించుకోకుండా కుక్కల్ని పట్టుకొని వ్యాక్సిన్ ఇచ్చి వదిలి పెడుతున్నారనే ఆరోపణలున్నాయి.

మెట్లు ఎక్కుతుంటే కరిచింది...



మాది ఎంఐజీ 2, బ్లాక్ నంబర్20. రెండు రోజుల క్రితం రాత్రి 9గంటల ప్రాంతంలో మెట్లు ఎక్కుతుండగా ఒక్కసారిగా రెండు మూడు కుక్కలు మీదికి వచ్చాయి. వాటి నుంచి తప్పించుకోవాడానికి ప్రయత్నించినప్పటికీ అందులో ఒకటి నన్ను కరిచింది. దానికి సంబంధించిన ట్రీట్‌మెంట్ తీసుకుంటున్నాను.

–కె. రాహుల్, బాగ్‌లింగంపల్లి

కు.ని. ఆపరేషన్ చేస్తున్నాం

కుక్కలను పూర్తిగా నియంత్రించడానికి అవకాశం లేదు. వాటికి పిల్లలు పుట్టకుండా కుటుంబ నియంత్రణ (కు.ని) ఆపరేషన్ చేస్తున్నాం. అన్ని కుక్కలకు వ్యాక్సిన్ ఇస్తున్నాం. సుప్రీం కోర్టు నిబంధన ప్రకారం వాటిని చంపడానికి అవకాశం లేదు. అందుకే వాటికి వ్యాక్సిన్ ఇచ్చి వదిలి పెడుతున్నాం. కుక్కల బెడద ఉన్నవారు ఫోన్ నం.91543 69424కు ఫిర్యాదు చేయవచ్చు.

– వనజ కుమారి,వెటర్నరి అధికారి

అధికారులు చర్యలు తీసుకోవాలి



సంబంధిత అధికారులు వెంటనే స్పందించి కుక్కల బెడదను నివారించేందుకు తగిన చర్యలు తీసుకోవాలి. బస్తీలలో పెద్ద ఎత్తున కుక్కలు తిరుగుతూ భయభ్రాంతులకు గురిచేస్తున్నా అధికారులు పట్టించుకోకపోవడం బాధాకరం. మనుషుల ప్రాణాలు పోతున్నా ప్రభుత్వాలకు పట్టవా.?

– మనోహర్‌రెడ్డి, వాకర్స్ క్లబ్ ప్రధాన కార్యదర్శి

స్కూళ్లను విభజించి ఫీజులు నిర్ణయించాలి

బీఎస్ఎంఏ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గుజ్జ సత్యం



కాచిగూడ: విద్యా హక్కు చట్టంలో 25 శాతం రిజర్వేషన్లపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని బడ్జెట్ స్కూల్స్ మేనేజ్‌మెంట్ అసోసియేషన్ (బీఎస్ఎంఏ) తెలంగాణ ఉపాధ్యక్షుడు గుజ్జ సత్యం కోరారు. విద్యా హక్కు చట్టం అమలు చేయాలని రాష్ట్ర కేబినెట్ తీసుకున్న నిర్ణయంపై పలు అనుమానాలు ఉన్నాయని వాటిని నివృత్తి చేసే బాధ్యత ప్రభుత్వానిదేనని ఆయన అన్నారు. అంతేకాకుండా ప్రైవేట్ స్కూళ్లను నాణ్యత, సౌకర్యాల ఆధారంగా ఏబీసీడీ కేటగిరీలుగా విభజించి, ఫీజులను నిర్ణయించాలని గుజ్జ సత్యం ప్రభుత్వానికి సూచించారు. 'స్కూళ్లలో అందించే విద్య నాణ్యత, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, ఇతర సౌకర్యాలను పరిగణలోకి తీసుకొని ఫీజుల నిర్ణయం జరగాలన్నారు. ఇది ప్రైవేట్ స్కూళ్లకు ఆర్థిక స్థిరత్వాన్ని, విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడంలో సహాయపడుతుందని పేర్కొన్నారు. విద్యా హక్కు చట్టంలో భాగంగా 25శాతం సీట్లకు ప్రభుత్వం ఫీజులు చెల్లిస్తామని ప్రతిపాదించిందని.. ఆ విధానంలో పలు లోపాలు ఉన్నాయని అన్నారు. ఇతర రాష్ట్రాల్లో అమలవుతున్న విధంగా సంబంధిత డబ్బులను నేరుగా విద్యార్థుల తల్లిదండ్రుల అకౌంట్‌లో జమ చేయాలని ఆయన పేర్కొన్నారు.

గీత కార్పొరేషన్ ద్వారానే నీరా కేఫ్ నిర్వహించాలి



సమావేశంలో మాట్లాడుతున్న నారాయణగౌడ్

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: తెలంగాణ రాష్ట్రంలో గీత కార్పొరేషన్ ద్వారానే నీరా కేఫ్‌ను నిర్వహించాలని.. టెండర్‌ను రద్దు చేయాలని గౌడ ఐక్య సాధన సమితి రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు అంబాల నారాయణగౌడ్ డిమాండ్ చేశారు. సోమవారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో గౌడ కల్లుగీత సంఘాల సమన్వయ కమిటీ ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా నారాయణగౌడ్ మాట్లాడుతూ... ఆగస్టు 18వ తేదీ వరకు జనగామ జిల్లాను పాపన్న జిల్లాగా ప్రకటించాలని డిమాండ్ చేశారు. ట్యాంక్ బండ్‌పై సర్దార్ సర్వాయి పాపన్న విగ్రహాన్ని ఏర్పాటు చేయడంతోపాటు పెండింగ్‌లో ఉన్న గీతన్నల నష్టపరిహారాన్ని వెంటనే చెల్లించాలని కోరారు. నందనం నీరా పరిశ్రమను వెంటనే ప్రారంభించాలని గీతాన్నలకు కొత్త పెన్షను ఇవ్వాలన్నారు. ఉత్తర తెలంగాణలో గీత వృత్తిదారులపై జరుగుతున్న వీడీసీల దాడులను అరికట్టాలని డిమాండ్ చేశారు. ప్రతి జిల్లాలో నీరా కేంద్రాన్ని ఏర్పాటు చేయడంతో పాటు రూ.10లక్షల ఎక్స్‌గ్రేషియో, ఆరోగ్య కార్డులను ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో గౌడ కుల హక్కుల పరిరక్షణ సమితి జాతీయ అధ్యక్షుడు నక్క కృష్ణగౌడ్, సర్వాయి పాపన్న మోకు దెబ్బ అధ్యక్షుడు జక్క వీరస్వామి, బీజేపీ గీత సెల్ అధ్యక్షుడు పటేల్ వెంకటేష్‌గౌడ్, జైగౌడ సంక్షేమ సంఘం అధ్యక్షుడు బుర్రా మల్‌సూర్, సోషల్ డెమోక్రటిక్ జాతీయ అధ్యక్షుడు కోల జనార్దన్, శ్రీకాంత్‌గౌడ్, కూరెళ్ల వేములయ్య, బొనగాని యాదగిరిగౌడ్, ముద్దగోని రామ్మోహన్‌గౌడ్, పరశురాం గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌టీఆర్ స్టేడియంలో జూన్9 వరకు చేనేత వస్త్ర ప్రదర్శన



మాట్లాడుతున్న చేనేత డ్వాక్రా మహిళా సంఘాల కార్యదర్శి కంభంపాటి పద్మజ తదితరులు

కవాడిగూడ: దేశ వ్యాప్తంగా ఉన్న చేనేత, హస్తకళాకారులతో తయారు చేసిన వస్త్ర ప్రదర్శనను జూన్ నెల 9వ తేదీ వరకు పొడిగించినట్లు చేనేత డ్వాక్రా మహిళా సంఘాల కార్యదర్శి కంభంపాటి పద్మజ తెలిపారు. సోమవారం ఎన్‌టీఆర్ స్టేడియంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. చేనేత వస్త్ర హస్తకళాకారుల విజ్ఞప్తి మేరకు ఎగ్జిబిషన్‌ను మరో పదిరోజుల పాటు పొడగిస్తున్నామని తెలిపారు. ఈ అవకాశాన్ని జంటనగరాల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఏప్రిల్ 26వ తేదీన ప్రారంభమైన వస్త్ర ప్రదర్శనకు వినియోగదారుల నుంచి మంచి స్పందన లభించిందని ఆమె తెలిపారు. ఆధునిక కాలంలో కూడా చేనేత వస్త్రాలకు ఆదరణ తగ్గడం లేదన్నారు. చేతి వృత్తి కళాకారులకు వినియోగదారులకు డైరెక్ట్‌గా మార్కెటింగ్ ప్లాట్‌ఫాం కల్పించే ఉద్దేశంతో చేనేత ప్రదర్శన ఏర్పాటు చేసినట్లు ఆమె తెలిపారు. ఈ అవకాశాన్ని జంటనగరాల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆమె సూచించారు. ఈ విలేకరుల సమావేశంలో నిర్వాహకులు గోవింద్, శ్యామ్ తదితరులు పాల్గొన్నారు.

పనులను త్వరితగతిన పూర్తి చేయాలి



రహమత్‌బాగ్‌లో సీసీరోడ్డు పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్, కార్పొరేటర్ ఉమారాణి

కాచిగూడ: అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తిచేసి ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూడాలని అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ అన్నారు. సోమవారం కాచిగూడ డివిజన్ రహమత్‌బాగ్‌లో రూ.20లక్షల వ్యయంతో నూతనంగా చేపట్టనున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులను కార్పొరేటర్ ఉమారాణితో కలిసి ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పాదయాత్ర నిర్వహించి స్థానిక ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ముఖ్యంగా మంచినీటి సరఫరా సరిగ్గా జరగడం లేదని.. దీంతో నీటి కోసం ఇబ్బందులకు గురవుతున్నామని తెలిపారు. రోడ్లు సక్రమంగా లేక గుంతల్లో నీరు నిలిచి ప్రమాదకరంగా మారాయని ఎమ్మెల్యేకు స్థానిక ప్రజలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జీహెచ్ఎంసీ డీఈ ప్రవీణ్, ఏఈ ప్రశాంత్, జలమండలి డీజీఎం కృష్ణ, ఏఈ భావన, బీఆర్ఎస్ నాయకులు ఎర్ర భీష్మదేవ్, శిరీష, ఓంప్రకాష్ యాదవ్, కృష్ణాగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

రూ.26లక్షలతో పార్కుల అభివృద్ధి పనులు



జవహర్‌నగర్ టీఆర్టీగ్రౌండ్ కాంపౌండ్ వాల్ నిర్మాణ పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్

చిక్కడపల్లి: గాంధీనగర్ డివిజన్‌లో రూ.26లక్షలతో చేపట్టిన పార్కుల అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేయాలని కార్పొరేటర్ పావని అన్నారు. జవహర్‌నగర్ టీఆర్టీగ్రౌండ్ కాంపౌండ్ వాల్ నిర్మాణం పనులను బీజేపీ సికింద్రాబాద్ పార్లమెంట్ జాయింట్ కన్వీనర్ ఎ.వినయ్‌కుమార్, జీహెచ్ఎంసీ ఇంజనీరింగ్ విభాగం వర్క్ ఇన్‌స్పెక్టర్ మహేష్‌లు, స్థానిక అసోసియేషన్ సభ్యులతో కలసి ఆమె పర్యవేక్షించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ... సురభిపార్కులలో కూడా సమన్వయంగా పనులు జరుగుతున్నాయని అన్నారు. వీటితో పాటు పెండింగ్‌లో ఉన్నా డివిజన్‌లోని ఇతర పార్కుల వద్ద కూడా అభివృద్ధి పనులు త్వరలో పూర్తి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు రత్న సాయిచంద్, శ్రీకాంత్, డీఎస్‌రెడ్డి, దోనేటి సత్యం, లక్ష్మీనారాయణ, స్థానికులు జలగం జయకుమార్, ప్రకాష్, శ్యామ్, రాజు, క్యాలబ్ తదితరులు పాల్గొన్నారు.

శాంతిభద్రతల పరిరక్షణకు సహకరించాలి

మైత్రి, పీస్ కమిటీ సమావేశంలో గాంధీనగర ఏసీపీ యాదగిరి



కవాడిగూడ: సమాజంలో శాంతిభద్రతల పరిరక్షణ, నేరాల అదుపునకు పోలీసులు ప్రజలకు మధ్య మైత్రి కమిటీ సభ్యులు వారధిగా వ్యవహరించాలని గాంధీనగర్ సబ్‌డివిజన్ ఏసీపీ ఎ.యాదగిరి సూచించారు. సోమవారం గాంధీనగర్ సబ్‌డివిజన్ పరిధిలోని బండ మైసమ్మనగర్ కమ్యూనిటీహాల్‌లో మైత్రి, పీస్ కమిటీ సభ్యుల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన గాంధీనగర్ ఏసీపీ యాదగిరి మాట్లాడారు. గాంధీనగర్, దోమలగూడ, లేక్‌పోలీస్ స్టేషన్ పరిధులలో ఎలాంటి సంఘటనలు జరిగినా వెంటనే మైత్రి, పీస్ కమిటీ సభ్యులు సమాచారం అందించాలని సూచించారు. ముఖ్యంగా బోనాలు, గణేష్ నవరాత్రి ఉత్సవాలు, రంజాన్ పండుగ సమయాల్లో ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలన్నారు. కుల, మతాలు రాజకీయాలకు అతీతంగా శాంతిభద్రతల పరిరక్షణకు కృషి చేయాలని సూచించారు. తమ పరిధిలో ఎలాంటి సంఘటనలు జరిగినా వెంటనే స్థానిక పోలీసులకు సమాచారం అందించాలన్నారు. ఎవరైనా అనుమానస్పద స్థితిలో తమ ప్రాంతాలలో సంచరించినా తెలియజేయాలని తెలిపారు. ముఖ్యంగా పండుగల సమావేశంలో ఎలాంటి గొడవలు జరగకుండా తమవంతు బాధ్యత వహించాలని సూచించారు. ఈ సమావేశంలో దోమలగూడ ఇన్‌స్పెక్టర్ దొంతిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, గాంధీనగర్ సీఐ బోస్‌కిరణ్, లేక్‌పోలీస్ స్టేషన్ సీఐ చిట్టి, ఎస్సైలు నర్సింహ, హరీష్, పూజారి తిరుపతి, ఏఎస్సైలు, కానిస్టేబుళ్లు పాల్గొన్నారు.

రైల్లో చోరీలకు పాల్పడుతున్న వ్యక్తి అరెస్ట్

ల్యాప్‌టాప్, ఐప్యాడ్, 13 సెల్‌ఫోన్లు స్వాధీనం

కాచిగూడ: రైళ్లలో దొంగతనాలకు పాల్పడుతున్న ఓ దొంగను కాచిగూడ రైల్వే పోలీసులు సోమవారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. కాచిగూడ రైల్వే పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో రైల్వే డీఎస్పీ ఎస్ఎన్. జావేద్, కాచిగూడ రైల్వే ఇన్‌స్పెక్టర్ ఆర్.ఎల్లప్ప, ఆర్‌పీఎఫ్ కాచిగూడ ఇన్‌స్పెక్టర్ గోరఖ్‌నాథ్ మల్ వివరాలు వెల్లడించారు. కాచిగూడ రైల్వేస్టేషన్‌లో పోలీసులు తనిఖీలు నిర్వహిస్తుండగా గోషామహల్ ప్రాంతానికి చెందిన నవనీత్ శర్మ (32) అనుమానస్పదంగా కనిపించాడు. అదుపులోకి తీసుకుని విచారించగా ఈనెల 21వ తేదీన ఏపీ సంపర్క్ క్రాంతి ఎక్స్‌ప్రెస్ రైల్లో ప్రయాణిస్తున్న ఓ ప్రయాణికుడి వద్ద నుంచి ఒక ల్యాప్‌టాప్, ఐఫోన్, ఇతర వస్తువులు దొంగిలించినట్లు అంగీకరించాడు. అంతేకాకుండా వైన్ షాపులు, బస్టాపులు, రైల్వే స్టేషన్లలో 12 మొబైల్ ఫోన్లను దొంగలించినట్లు తెలిపారు. అతని వద్ద నుంచి రూ.2,70,000 విలువైన ఒక ల్యాప్‌టాప్, ఆపిల్ ఐప్యాడ్, 13 మొబైల్ ఫోన్‌లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. అనంతరం నవనీత్ శర్మను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. దొంగను పట్టుకున్న రైల్వే పోలీస్ సిబ్బందిని రైల్వే పోలీస్ సూపరింటెండెంట్ చందన దీప్తి(ఐపీఎస్),ఐజీపీ కె.రమేష్ నాయుడు అభినందించారు. వారికి తగిన రివార్డులు అందించనున్నట్లు తెలిపారు.

బంగారు ఆభరణాలు, సెల్‌ఫోన్లు చోరీ

కాచిగూడ: రైల్లో ప్రయాణిస్తున్న ఓ ప్రయాణికుడి బ్యాగ్ చోరీకి గురైన సంఘటనపై కాచిగూడ పోలీసులు జీరో ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. రైల్వే ఇన్‌స్పెక్టర్ ఆర్.ఎల్లప్ప తెలిపిన వివరాల ప్రకారం... లింగంపల్లి ప్రాంతానికి చెందిన రఘునాథ్ (35) తల్లి, భార్యతో కలిసి నాగర్‌సోల్ నుంచి కాచిగూడకు అజంతా ఎక్స్‌ప్రెస్ రైల్లో వస్తున్నాడు. నిజామాబాద్ రైల్వే స్టేషన్ వద్ద చూసుకునే సరికి బ్యాగ్ కనిపించలేదు. బ్యాగులో 15 గ్రాముల బంగారు ఆభరణాలు, రెండు సెల్‌ఫోన్లు ఉన్నాయి. బాధితుడు సోమవారం కాచిగూడ రైల్వే పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. పోలీసులు జీరో ఎఫ్ఐఆర్ నమోదు చేసి తదుపరి విచారణ నిమిత్తం కేసును నిజామాబాద్ రైల్వే పోలీస్ స్టేషన్‌కు బదిలీ చేశారు.

రైలు ఢీకొని గుర్తుతెలియని వ్యక్తి మృతి

కాచిగూడ: రైలు ఢీకొని గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందిన సంఘటన కాచిగూడ రైల్వే పోలీస్‌స్టేషన్ పరిధిలో సోమవారం జరిగింది. రైల్వే హెడ్ కానిస్టేబుల్ సమ్మయ్య తెలిపిన వివరాల ప్రకారం... గుర్తుతెలియని వ్యక్తి (45) మలక్‌పేట- కాచిగూడ రైల్వే స్టేషన్ల మధ్య పట్టాలు దాటుతుండగా రైలు ఢీకొని మృతి చెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా మార్చురీకి తరలించారు. రైల్వే పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

విద్యార్థులను ప్రోత్సహించేందుకే ప్రతిభా పురస్కారాలు



అంబర్‌పేట: చదువుల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన ఆర్యవైశ్య విద్యార్థులకు అంబర్‌పేట ఆర్యవైశ్యం సంఘం ఘనంగా సత్కరించి ప్రతిభా పురస్కారాలను అందించింది. సోమవారం అంబర్‌పేటలో సంఘం కార్యాలయంలో పది, ఇంటర్ విద్యలో 90 శాతానికి పైగా ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులకు ప్రశంస పత్రం, మెడల్‌తో పాటు నగదును అందజేసింది. ఈ సందర్భంగా సంఘం వ్యవస్థాపక చైర్మన్ మాట్లాడుతూ... నాలుగేళ్లుగా విద్యార్థులను చదువులో ప్రోత్సహించేదుకు ఇలాంటి కార్యక్రమాలను చేపడుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు కె.శ్రీనివాస్‌గుప్తా, ప్రధాన కార్యదర్శి జె.శ్రీనివాస్‌గుప్తా, కోశాధికారి వాసు, సంఘం నాయకులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలి

ముషీరాబాద్: విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని త్వైకాండో మార్షల్ ఆర్ట్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ప్రవీణ్‌కుమార్ అన్నారు. సోమవారం పద్మకాలనీలో ఓం త్వైకాండో అకాడమీ ఆధ్వర్యంలో మార్షల్ ఆర్ట్స్ త్వైకాండో కలర్ బెల్ట్ పరీక్షలో ఎంపిక కోసం త్వైకాండో మాస్టర్ ప్రసన్న ఆంజనేయులు ఆధ్వర్యంలో నిర్వహించిన పోటీల్లో విద్యార్థులకు సర్టిఫికెట్లు, మెమోంటోలు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా 90 మంది విద్యార్థులకు త్వైకాండో కలర్ బెల్ట్‌లను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఓం త్వైకాండో సలహాదారులు గౌరీశంకర్, అధ్యక్షుడు రవికిరణ్, త్వైకాండో పోటీల నిర్వాహకులు సూర్య, శ్రీనిక, హాసిని, భార్గవ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతి జర్నలిస్టు నిస్వార్థంగా పనిచేయాలి



న్యాయపతి రమేష్‌బాబుకు పురస్కారం ప్రదానం చేస్తున్న ఆచార్య గౌరీశంకర్

చిక్కడపల్లి: చిక్కడపల్లిలోని శ్రీకృష్ణ మందిరంలో మాదల వీరభద్రరావు స్మారక సమితి, సాధన సాహితీ స్రవంతిల ఆధ్వర్యంలో స్వాతంత్ర్య సమర యోధుడు మాదల వీరభద్రరావు జయంతిని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి తెలుగు విశ్వవిద్యాలయం పూర్వ రిజిస్ట్రార్ ఆచార్య గౌరీశంకర్ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. వీరభద్రరావుకు దేశభక్తి, సంపాదక వృత్తిపట్ల ఉన్న నిబద్ధతే నేటి తరానికి కూడా ఉండాలన్నారు. ప్రజాస్వామ్యంలో పత్రికలది ప్రముఖ పాత్ర అని ప్రతి జర్నలిస్టు నిస్వార్థంగా పనిచేయాలన్నారు. ఈ సందర్భంగా ప్రముఖ పాత్రికేయుడు న్యాయపతి రమేష్ బాబుకు గౌరీశంకర్ చేతుల మీదుగా మాదల వీరభద్రరావు స్మారక పురస్కారాన్ని ప్రదానం చేసి సన్మానించారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ హాస్యావధాని శంకరనారాయణ, సాధన నరసింహాచార్య, మాదల రాజేంద్రప్రసాద్, రఘుశ్రీ, రాయప్రోలు రమణ, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్టీరామారావు ఉత్తమ ప్రజాపాలకుడు



మాట్లాడుతున్న ఏనుగు నరసింహారెడ్డి, కళా జనార్దనామూర్తి

చిక్కడపల్లి: రాజకీయాలతో పాటు సినీ పరిశ్రమలో ఎన్టీఆర్ తనదైన ముద్రవేశారని ప్రముఖ సాహితివేత్త ఏనుగు నరసింహారెడ్డి అన్నారు. సోమవారం త్యాగరాయ గానసభ ఆధ్వర్యంలో ఎన్టీరామారావు జయంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎన్నో ప్రజా సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి ప్రజల గుండెల్లో స్థానం సంపాదించారన్నారు. ప్రజలకు పాలన చేరువ కావాలనే ఉద్దేశంతోనే మండల వ్యవస్థను ఆరంభించిన ఉత్తమ ప్రజాపాలకుడని కొనియాడారు. తెలుగు భాష.. తెలుగుజాతికి జాతీయ స్థాయిలో గుర్తింపు, గౌరవం దక్కడానికి ఎన్టీఆరే కారణమని తెలిపారు. ఈ కార్యక్రమంలో వీఎస్ కళాజనార్దనామూర్తి, నైషధం సత్యనారాయణ మూర్తి, వెంకట్‌రెడ్డి, గాయని అన్నపూర్ణ, సంగీత గాయని మల్లాది ఉష పాల్గొన్నారు.